జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

శుక్రవారం | 5-12-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 528 పేజీలు: 4 వెల : రూ.7

# అనుమతులు కొంత.. భవన నిర్మాణాలు కొండంత!



* జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా అపార్టుమెంట్ల నిర్మాణం
* కనీస ప్రమాణాలు, నాణ్యత పాటించని బిల్డర్లు
* పైపై మెరుగులతో లక్షల్లో దోపిడీ
* ఫేక్ డాక్యుమెంట్లతో బ్యాంకుల్లో భారీగా రుణాలు
* కాసులకు కక్కుర్తి పడి కన్నెత్తి చూడని టౌన్‌ప్లానింగ్, సుడా అధికారులు
* ఎవరైనా ప్రశ్నిస్తే 'ఎమ్మెల్యే గారి తాలూకా' అంటూ సమాధానాలు

**పలాస, డిసెంబరు 4 (వార్త):** జిల్లాలో అపార్టుమెంట్ల నిర్మాణాల్లో కనీస నిబంధనలు, నాణ్యతా ప్రమాణాలను బిల్డర్లు పట్టించుకోవడం లేదు. వీటి నిర్మాణాలపై నగరపాలక సంస్థ, మున్సిపల్, సుడా అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధముగా భారీ భవంతులు, బహుళ అంతస్తులు , అక్రమ కట్టడాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. కొందరు బడాబాబులు ఎలాంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్థులు నిర్మాణం చేపడుతూ ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నా... చేతివాటంకు అలవాటుపడ్డ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. భవన నిర్మాణాలకు తీసుకున్న అనుమతులు ఒకటి, కడుతున్న నిర్మాణాలు మరోటిలా ఉన్నా పర్యవేక్షించే వారు కరువయ్యారు. లక్షల్లో ముడుపులు దండుకుంటున్న అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేయడంతో పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో యథేచ్ఛగా అక్రమ అపార్ట్ మెంట్లు, భారీ బహుళ అంతస్తులు వెలుస్తున్నాయి. పలాసలో నేతాజీనగర్, తిలక్ నగర్, ఐటిఐ నగర్, శివాజీ నగర్, సూది కొండ పరిధిలో రెండు, మూడు స్లాబ్ లకు అనుమతులు తీసుకొని, ప్రమాదకరస్థాయిలో ఐదు అంతస్తుల భవంతుల నిర్మాణాలు చేపడుతుండటంతో స్థానికుల్లో భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. బిల్డర్లు ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి బ్యాంకుల నుంచి లక్షల్లో రుణాలు తీసుకుంటున్నారు. పేదలు ఇళ్ల నిర్మాణాలు చేపడితే గద్దల్లా వాలిపోతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు, ఆ శాఖలోని అవుట్ సోర్సింగ్ సిబ్బంది, పెద్దలు నిర్మిస్తున్న భవనాలపై కన్నెత్తి కూడా చూడడం లేదు. సరికదా వారికి కొమ్ముకాస్తున్నారు. ఎవరో ఒకరిద్దరు ప్రశ్నిస్తే 'ఎమ్మెల్యే గారి తాలూకా' అంటూ చెబుతుండడంతో అధికారులకే లేనిది తమకెందుకులే అని కొందరు సిబ్బంది సైలెంట్ అవుతున్నారు. ఎమ్మెల్యేలకు తెలిసి జరుగుతుందో.. లేదో తెలియదు గాని, వారి పేరును మాత్రం కొందరు బిల్డర్లు బాగానే వాడుకుంటున్నారు. దీన్ని ప్రజాప్రతినిధులు పసిగట్టకపోతే మొదటికే మోసం వచ్చే అవకాశం ఉంది. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ కమిషనర్‌కు ఇటీవల బదిలీపై వెళ్లడంతో పాటు టౌన్ ప్లానింగ్ అధికారి లేకపోవడంతో కొంతమంది సిబ్బంది కాసులు దండుకుంటూ ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇకనైనా పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ ఈ అక్రమ భవన నిర్మాణాలపై దృష్టి సారించాల్సివుంది.

## ప్రధాన రహదారులు కబ్జా

**నరసన్నపేట:** నరసన్నపేట పట్టణంలోని ప్రధాన రహదారులు కబ్జాకు గురవుతున్నాయి. వ్యాపారులు తమ షాపులకు ముందున్న కాలువలు, రోడ్లు ఆక్రమించేసి వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీనివల్ల రోడ్డు కుదించుకుపోయి నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తాత్కాలిక దుకాణాల పేరుతో రోడ్లను పూర్తిగా మింగేస్తున్నారు. ప్రశ్నించే వారు లేకపోవడంతో ఆక్రమణలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. మేజర్ పంచాయతీ అధికారులు సైతం అటువైపుగా చూడడం లేదు.



## ఫుట్‌పాత్‌లు మాయం

శ్రీకాకుళం: శ్రీకాకుళం నగరంలోని ఫుట్‌పాత్‌లు మాయమయ్యాయి. నగరంలో ట్రాఫిక్ ఎక్కువ కావడంతో పాదచారుల కోసం ప్రధాన రహదారులకు ఇరువైపులా కాలువలపై కోట్లు ఖర్చు పెట్టి ఫుట్‌పాత్‌లు నిర్మించారు. ప్రస్తుతం ఆ ఫుట్‌పాత్‌లను వ్యాపార సంస్థలతో పాటు కొందరు భవన నిర్మాణదారులు ఆక్రమించేశారు. ఈ ఫుట్‌పాత్‌లను కొందరు వ్యాపార కేంద్రాలుగా మార్చుకున్నారు. జిల్లా కేంద్రంలోని అన్ని ప్రధాన రహదారుల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఇటీవల కాలువల్లో చెత్తను తొలగించేందుకు నగరపాలక సంస్థ అధికారులు నానావస్థలు పడ్డారు. ఫుట్‌పాత్‌లపై పలకలు తీసి చెత్త తొలగించేందుకు లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సివచ్చింది. ఆర్టీసీ కాంప్లెక్స్, అంబేడ్కర్ జంక్షన్, డేఅండ్ నైట్ జంక్షన్, పాలకొండ రోడ్డు, ఏడురోడ్ల జంక్షన్, మార్కెట్ రోడ్డు, రైతుబజార్ రోడ్డు, రామలక్ష్మణ జంక్షన్, సూర్యమహాల్ జంక్షన్, పాతబస్టాండ్.. ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని ప్రధాన రహదారుల్లోనూ కాలువలు ఆక్రమణకు గురయ్యాయి. ఫుట్‌పాత్‌లు మాయమవ్వడంతో పాదచారులు రోడ్లపై నుంచి వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇకనైనా నగరపాలక సంస్థ, పోలీసు అధికారులు స్పందించి ఈ ఆక్రమణలపై దృష్టి సారించాల్సివుంది.

# జల్సాలకు పోయి.. దొంగయ్యారు!

* ఆలయాల్లో దొంగతనాలు, బైక్ చోరీలకు పాల్పడిన ముగ్గురు అరెస్టు
* సుమారు 1.71 లక్షల విలువైన ప్రాపర్టీ స్వాధీనం
* వివరాలు వెల్లడించిన డీఎస్పీ వివేకానంద

**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 4 (వార్త):** రాత్రిపూట దొంగతనం చేసి వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసుకోవడం వృత్తిగా చేసుకున్నారు. ఆలయాలు కనిపిస్తే చాలు.. తలుపులు పగులగొట్టి హుండీ పగులగొట్టడం, బంగారు, వెండి, ఇత్తడి వస్తువులు దొంగిలించి వాటిని విక్రయించడం, దిచక్రవాహనం కనిపిస్తే చాలు ఎత్తుకెళ్లడం వంటి అసాంఘిక పనులు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు పట్టుకుని కటకటాల్లోకి నెట్టారు. వారంతా పాత నేరస్థులు కావడం గమనార్హం. దీనికి సంబంధించిన వివరాలను శ్రీకాకుళం డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద గురువారం మీడియాకు వెల్లడించారు. జిల్లాలో పలు ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు నిందితులను శ్రీకాకుళం రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుండి సుమారు 1 లక్ష 71 వేల 200 రూపాయలు, వెండి, ఇత్తడి, రాగి, కంచు సామాన్లు రికవరీ చేసుకున్నామన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలంలోని పెద్దగణగళ్లవానిపేటకు చెందిన చింతపల్లి గోపాల కృష్ణమూర్తి ఈ ఏడాది జులై 7న తమ గ్రామంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో చోరీ జరిగిందని ఫిర్యాదు చేశారన్నారు. దీంతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం జాలారిపేటకు చెందిన ఎరుపల్లి అశోక్ (20), గార మండలం బలరాంపురం గ్రామానికి చెందిన చోడిపల్లి వంశి(20), ఆమదాలవలస మండలం తోటాడకు చెందిన బెండి శివప్రకాష్ (22)లు ఈ చోరీలకు పాల్పడినట్టు గుర్తించి పట్టుకున్నామన్నారు. ఈ ముగ్గురు గతంలో ఆమదాలవలస పోలీస్ స్టేషన్ పరిధిలో మోటార్‌సైకిల్ దొంగతనం కేసులో అరెస్ట్ అయ్యి, 45 రోజులు జైలు శిక్ష అనుభవించారన్నారు. చెడు వ్యసనాలకు లోనై, రాత్రి సమయంలో దేవాలయాలు, ద్విచక్ర వాహనాల దొంగతనాలు చేయడం ప్రారంభించారన్నారు. వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసుకునేవారన్నారు. వీరు శ్రీకాకుళం రూరల్ పీఎస్ పరిధిలో సింగుపురం,పెద్ద గహనగలవాని పేట, కనుగులవానిపేట, గార పీఎస్ పరిధిలో కె. సవిరగాం, కళింగపట్నం,అచ్చెనపాలెం, శ్రీకాకుళం 1 టౌన్, నందిగాం పరిధిలో నరేంద్రపురంలో చోరీలకు పాల్పడ్డారని, వీరిపై 15 కేసులు నమోదయ్యాయన్నారు. వీరిని ఈనెల 3న అంపోలు ఫ్లైఓవర్ వద్ద శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ, సిబ్బందితో కలిసి పట్టుకుని అరెస్టు చేశారన్నారు. ఈ కేసులను ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన రూరల్ సర్కిల్ సిఐ కె.పైడపునాయుడు, రూరల్ ఎస్సై కె.రాము సిబ్బంది జగదీశ్, రవి, బాబురావును జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అభినందించారు.



## లోకేష్‌కు ఘనస్వాగతం



**శ్రీకాకుళం, డిసెంబర్ 4 (వార్త):** పార్వతీపురం మన్యం జిల్లా భామినిలో శుక్రవారం జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో సీఎం చంద్రబాబునాయుడు పాల్గొనున్నారు. దీంతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గురువారం ఆయన శ్రీకాకుళం జిల్లాలోని పైడిభీమవరం, శ్రీకాకుళం, ఆముదాలవలస, పాలకొండ మీదుగా భామిని చేరుకున్నారు. ఈ నేపథ్యంలో దారిపొడవున లోకేష్‌కు కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. పైడి భీమవరం వద్ద ఎమ్మెల్యే ఎన్ఈఆర్, కొత్త రోడ్డు వద్ద శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి సతీమణి, మాజీ ఎంపీపీ ప్రమీల, నేతలు స్వాగతం పలికారు. భామినిలో పాలకొండ నియోజకవర్గ కార్యకర్తలతో లోకేష్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌చార్జ్ కింజరాపు అచ్చెన్నాయుడు భామినిలో లోకేష్‌కు స్వాగతం పలికారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## డిప్యూటీ ఎంపీడీవోగా శాంతకుమారి బాధ్యతల స్వీకరణ



**సోంపేట, డిసెంబరు 4(వార్త):** సోంపేట డిప్యూటీ ఎంపీడీవో గా ఎం శాంతకుమారి గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఎంపీడీవో ఈశ్వ రమ్మ నుంచి ఉత్తర్వులు పొందారు. శాంతకుమారికి మండలంలో గల గ్రామ సచివాలయాల నిర్వహణ బాధ్యతలను ప్రత్యేకంగా అప్పగించారు. మండల పరిషత్ కు గ్రామ సచివాలయాలకు ఇకనుంచి సమన్వయకర్తగా శాంతకుమారి విధులు నిర్వహించనున్నారు. ఇప్పటివరకు ఈమె సోంపేట మేజర్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా విజయవంతంగా విధులను నిర్వహించారు.

విధుల స్వీకరణ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకట్రావు, మండల పరిషత్ సిబ్బంది, గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది శాంతకుమారికి పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.

### మందస

## ఆరుతడి పంటలతో అధిక లాభాలు



**మందస, డిసెంబరు 4(వార్త):** ఆరుతడి పంటలతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సీహెచ్ వెంకటరావు, ఆముదలవలస కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్, మందస మండల వ్యవసాయాధికారి జి.నాగరాజు అన్నారు. మందస మండలంలోని బిన్నలమదనాపురం, హరిపురం గ్రామాలలో ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస యోజన, ఆత్మ పథకాలు క్రింద రైతులకు వరి, మినుములు, పెసర, మొక్కజొన్న, వేరుశెనగ పంటలలో అధిక దిగుబడులు సాధించడానికి మేలైన యాజమాన్య పద్ధతులపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరుతడి పంటలు రైతులను ఆదుకుంటాయన్నారు. పెసర, మినుములలో వేపనూనె, 19-19-19, క్లోరోఫైరీపోస్ మందులు వాడితే అధిక దిగుబడులు వస్తాయన్నారు. మొక్కజొన్నలో ఎరువులు యాజమాన్యం, కలుపు యాజమాన్యం, కత్తెరపురుగు యాజమాన్య పద్ధతులను వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సీహెచ్ వెంకటరావు, ఆముదలవలస కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్, మందస మండల వ్యవసాయాధికారి జి.నాగరాజులతో పాటు వ్యవసాయ విస్తరణాధికారి కె.జ్యోత్స్న, రైతులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు 'నగిరి' ప్రోత్సాహం



**మందస, డిసెంబరు 4(వార్త):** మందస మండల స్థాయిలో జరిగిన గ్రిగ్స్ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సొండిపూడి విద్యార్థులు కబడ్డీ విభాగంలో బాలురు, బాలికలు ప్రథమ స్థానాలను కైవసం చేసుకుని విజేతలుగా నిలిచారు. వీరిని ప్రోత్సహిస్తూ క్రీడలపై గల మక్కువతో సొండిపూడి గ్రామానికి చెందిన ఎల్ఎఫ్ఎల్ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు నగిరి లక్ష్మీనారాయణ 2,000రూపాయలు విలువ చేసే జామెట్రీ బాక్స్ లు, పెన్ లను అందజేశారు. అంతేకాకుండా ఫిజికల్ డైరెక్టర్ ఎస్.విజయ్ ను శాలువతో సత్కరించి క్రీడాభిమానాన్ని చాటుకున్నారు. రిటైర్డ్ హెడ్మాస్టర్ నగిరి లక్ష్మీనారాయణకు పాఠశాల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తూ ప్రధానోపాధ్యాయుడు సుందర్ సోలమన్ మాట్లాడుతూ ఆయన ప్రోత్సాహం కొండంత బలమని, ఇంకా ముమ్ముందు ఆటలలో రాణిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఐటీయు అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం చేయండి



**మందస, డిసెంబరు 4(వార్త):** సీఐటీయు అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయు మండల కన్వీనర్, కోకన్వీనర్ కె.కేశవరావు, పి.దేవేంద్ర పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 31నుండి జనవరి 4వ తేదీ వరకు జరుగు ఈ మహాసభలను జయప్రదం చేయాలన్నారు. జీడి కార్మికులు, రైస్ మిల్ కార్మికులు, హమాలీలు తీవ్రమైన శ్రమదోపిడికి గురవుతున్నారన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్ గ్రాట్యుటి వంటి కార్మిక చట్టాలను యాజమాన్యాలు అమలు చేయడం లేదని, కార్మికులకు భద్రత లేకుండా బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి, రైస్ మిల్, హమాలీలకు కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజన పథకం తదితర స్కీం వర్కర్స్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. ఐక్య పోరాటాల ద్వారా మన హక్కులు సాధించుకోవచ్చని, అందుకోసం కార్మిక సమస్యలు పరిష్కారంకై పోరాటాలు రూపకల్పనకు 18వ అఖిల భారత మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని, జనవరి 4న జరిగే కార్మిక ర్యాలీ, బహిరంగ సభను కార్మిక వర్గం పాల్గొని విజవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఎం.ధర్మారావు, సీఐటీయు నాయకులు ఎస్.వల్లభ, మూర్తి. బి.చిన్నోడు తదితరులు పాల్గొన్నారు.

## వీరభద్రలో రేషన్ డిపో ప్రారంభించిన శిరీష

**మందస, డిసెంబరు 4(వార్త):**మందస మండలంలోని వీరభద్ర గ్రామంలో రేషన్ డిపోను పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు వివరించారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, సాలిన మాధవరావు, లబ్బ రుద్రయ్య, తమిరియా భాస్కరరావు, మామిడి తాతారావు, పందిరి రామారావు, పందిరి భాస్కరరావు, పాలిన తాతారావుగారు, ముడిముంచి నవీన్ కుమార్ యాదవ్, కొట్ర ఆనంద్, ముంజేటి చంద్రశేఖర్, మంగుళ పాత్రో, గుంట నారాయణ, గొర్లె హరీష్, బత్తిన తారక్ తదితరులు పాల్గొన్నారు.



# మందస జూనియర్ కళాశాలను పరిరక్షించాలి

**-ప్రిన్సిపల్ తేజేశ్వరరావుతో ప్రజా సంఘాల చర్చలు**

**-ప్రైవేటు శక్తుల చేతుల్లోకి వెళ్లిపోనున్న కళాశాల**

**-ప్రజా ప్రతినిధులు వెంటనే జోక్యం చేసుకోవాలి**



**మందస, డిసెంబరు 4(వార్త):** మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలను కాపాడుకోవాలని, ఈ బాధ్యత ప్రజలందరిపై ఉందని పౌర హక్కుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపల్ బి.తేజేశ్వరరావుని కలసి, పలు విషయాలపై చర్చించారు. మందస పట్టణంలో 1981-82లో ఏర్పడిన ప్రభుత్వ జూనియర్ కళాశాల నేడు తన ఉనికినే కోల్పోయే పరిస్థితి ఉందని, ప్రైవేట్ వ్యక్తులు ప్రయత్నాలు మొదలు పెడుతున్నారన్నారు. మందస రాజుల వారసులచే కేటాయించబడ్డ ఎకరా 50సెంట్లు స్థలంలో కళాశాల ప్రజల చేత నిర్మించబడిందన్నారు. కళాశాల నిర్మాణానికి మందస ప్రజలు చుట్టుపక్కల ప్రజలు, విజ్ఞానవంతులు సహాయ సహకారాలు, కృషి ఎంతో ఉందన్నారు. చదువు, జ్ఞానం, అవసరాన్ని ప్రజలు గుర్తించి, నిర్మించుకున్న




కళాశాల నేడు ప్రైవేటు శక్తుల చేతుల్లోకి వెళ్ళిపోతున్న పరిస్థితులు సృష్టించబడుతున్నాయన్నారు. పౌర హక్కుల సంఘం మందసలో ప్రజలు, కళాశాల యాజమాన్యంతో మాట్లాడినప్పుడు చాలా విషయాలు తెలిసాయన్నారు. దేవాలయం, దాని నేపథ్యం.. మందస రాజుల వారసుల నుండి కాలేజీ స్థలం ఎలా కేటాయించబడింది.. అనేక విషయాలు పౌర హక్కుల సంఘం సేకరించిందన్నారు. దేవాదాయ శాఖ నుండి వందల ఎకరాల భూములు ప్రైవేటు శక్తులకు ఎలా కేటాయించబడ్డాయని అనే ప్రశ్న మొదలవుతుందన్నారు. చారిత్రక విషయాలు ఎన్ని ఉన్నా ప్రభుత్వ కళాశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన ఉన్నదన్నారు. ఉచిత విద్య అందిస్తున్నాం, దానికోసం కొట్లాది రూపాయలు బడ్జెట్ కేటాయిస్తున్నాం, పేదవారికి చదువు అందుబాటులో ఉండాలి.. అని ప్రకటన చేస్తున్న ప్రభుత్వాలు, పాలకులు కళాశాలపై వస్తున్న జ్యుడీషియల్ ఇబ్బందులను పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. తక్షణమే ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని కళాశాల భూమిపై వస్తున్న వివాదాలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని పౌర హక్కుల సంఘం భావిస్తుందన్నారు. ఈ నిజనిర్ధారణలో పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పత్రి దానేష్, పిట్ట జోగారావు, పోతనపల్లి వైకుంఠరావు, డొక్కరు దానయ్య, బోనీల రామారావు, మహిళా సంఘ నాయకులు నాగమణి పాల్గొన్నారు.

## మందసలో సీపీఐఎంఎల్ లిబరేషన్ విస్తృత ప్రచారం




**మందస, డిసెంబరు 4(వార్త):** కడపలో జరగబోయే రాష్ట్ర మహాసభలను జయప్రధం చేయాలని మందసలో సీపీఐఎంఎల్ లిబరేషన్ నాయకులు విస్తృత ప్రచారం చేశారు. సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ 9వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 6, 7తేదీల్లో కడపలో జరగనున్నాయన్నారు. ఈ మహాసభలను విజయవంతం చేయడానికి ప్రజలు, ప్రజాస్వామికవాదులు సహాయ సహకారాలు అందించాలని సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, జిల్లా నాయకుడు మద్దిల రామారావు కోరారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసి, ప్రజాస్వామ్యాన్ని బుగ్గిపాలు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయాలని, ప్రజాస్వామ్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం వర్ధిల్లే ఆంధ్రప్రదేశ్ నిర్మాణం చేసే క్రమంలో సీపీఐ ఎంఎల్ మహాసభలు కడపలో నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో గల సంపదను కార్పోరేట్ అధానీ, అంబానీలకు చెందడానికి సంస్కరణలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, కె.ఈశ్వరమ్మ, పి.నాగేశ్వరరావు, కె.లోకనాదం, రవి, కోదండు, సింహాద్రి, క్రృష్ణవేణి, బానుమతి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి మందసలో గాయత్రీ జ్ఞాన మహాయజ్ఞం

**-సిద్ధమైన యాగశాల సముదాయం**

**-నేటి నుంచి మూడు రోజుల పాటు యజ్ఞం**

**మందస, డిసెంబరు 4(వార్త):**

మందస పట్టణం ఆధ్యాత్మికతకు వేదికగా మారింది. 108 కుండముల గాయత్రీ జ్ఞాన మహాయజ్ఞానికి సర్వం సిద్ధమైంది. మందస పట్టణంలోని శ్రీమన్నారాయణ వెంచర్ దరిలో యాగశాలను ఏర్పాటు చేశారు. హరిద్వార్ శాంతికుంజ్ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి ఏడవ తేదీవరకు మూడు రోజుల పాటు ఈ మహాయజ్ఞాన్ని భారీ ఎత్తున నిర్వహించడానికి నిర్వాహకులు ఏర్పాటు సిద్ధం చేశారు. 5న సాయంత్రం మూడు గంటలకు మందస శివార్లో గల గోపాలసాగరం నుంచి యజ్ఞస్థలం వరకు 251 కలశాలతో కలశయాత్ర, ఆరు గంటలకు 1008 దీపాలతో దీపామహ యజ్ఞం, ఆరున ఉదయం 9గంటలకు గాయత్రి తీర్థ శాంతికుంజ్(హరిద్వార్) తత్వాధాన్





పండితులతో 108 కుండములతో గాయత్రీ జ్ఞాన మహాయజ్ఞం, దేవపూజనం, సర్వతోభద్ర వేదిక పూజనం నిర్వహిస్తారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలుంటాయన్నారు. అదేవిధంగా ఏడున ఉదయం 7గంటల నుంచి 8గంటల వరకు సామూహిక గాయత్రీజపం, 9గంటలకు గాయత్రీ జ్ఞాన మహాయజ్ఞం, పూర్ణాహుతి, అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. పురుషులు పంచె, కండువా, మహిళలు వీలైనంతవరకు పసుపువర్ణం కలిగిన చీరలు ధరించి యజ్ఞంలో పాల్గొనాలని కోరారు. అందరూ ఆహ్వానితులేనని, భక్తులంతా పాల్గొని, కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## దాత సహకారంతో కోదండరామాలయ అభివృద్ధి

**సోంపేట, డిసెంబరు 4(వార్త):** సోంపేటలో వందల ఏళ్ల క్రితం చిన్న కోమటి వీధి శివారున నిర్మించిన శ్రీ కోదండరామ ఆలయం దాత సహకారంతో అభివృద్ధి దిశలో సాగుతోంది. కొత్తగా కోదండరామ ఆలయ ట్రస్ట్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన బీన ఆనంద్ పర్యవేక్షణలో లక్షలాది రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు ఆలయంలో చకచకా సాగుతున్నాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో ఈ ఆలయం ఉన్నప్పటికీ అభివృద్ధి విషయంలో అంతగా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఆలయంలో ఎన్నో సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. వీటిని పరిష్కరించేందుకు ఆలయాన్ని మరింత అభివృద్ధి దిశగా నడిపించేందుకు ట్రస్ట్ చైర్మన్ ఆనంద్ ఇటీవల ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ అలాగే మాజీమంత్రి గౌతు శ్యామసుందర శివాజీ లను ఆలయం వద్దకు ఆహ్వానించి సమస్యలను ప్రత్యక్షంగా వివరించారు. ఒకవైపు దేవాదాయ శాఖ నుంచి నిధులు రప్పించేందుకు ప్రయత్నాలు సాగుతుండగా మరోవైపు స్వతహాగా ఆలయం అభివృద్ధికి ముందుకు వచ్చిన దాత సహకారాన్ని కూడా తీసుకున్నారు. సోంపేట కు చెందిన గుప్త దాత ఆర్థిక సహాయంతో ఆలయం చుట్టూ వర్షానికి నిల్వగా ఉండిపోతున్న నీరును బయటకు మళ్ళించేందుకు డ్రైనేజీ వ్యవస్థ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అలాగే ఆలయం చుట్టూ ఉన్న భాగం కొంత లోతుగా ఉండడంతో వాస్తు నిపుణుల సూచన మేరకు దాన్ని ఎత్తి చేసేందుకు తగు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం ఆలయం చుట్టూ గ్రానైట్ పలకలు వినియోగించి ఎత్తును పెంచేందుకు తగువిధంగా పనులు చేపడుతామని చైర్మన్ ఆనంద్ తెలిపారు. దీంతో ఆలయ ఆవరణ అంతా మరింత అందంగా తీర్చిదిద్దుతామని అన్నారు.



### సోంపేట

## అసిస్టెంట్ కమిషనర్ హరీష్‌కు అభినందనలు



**సోంపేట, డిసెంబరు 4(వార్త):** కంచిలి మండలం తలతంపర గ్రామానికి చెందిన మర్రిపాటి హరీష్ కుమార్ విశాఖపట్నంలో అసిస్టెంట్ సేల్స్ కమిషనర్ గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఒక స్థాయికి ఎదిగిన హరీష్ కుమార్ ను సొంత మండలానికి చెందిన పలువురు టిడిపి నాయకులు నేరుగా విశాఖపట్నం సేల్స్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు అందించి దుస్సాలు వలు కప్పి హరీష్ ను అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ఉద్దానం గర్వపడేలా మరిన్ని ఉన్నతి పదవులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మాదిన రామారావు, టిడిపి నాయకులు టీవీ రమణ, హరిబాబు, పురాణ, కామేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## జోగారావు సేవలు అమూల్యం



**సోంపేట, డిసెంబరు 4(వార్త):** సోంపేట మండలం పలాసపురం గ్రామానికి చెందిన అనేకమంది రైతులు సర్పంచ్ తడక జోగారావు సేవలను ఎంతగానో హర్షించారు. దశాబ్దాలుగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు జోగారావు తెరదించారు. పంచాయతీ నిధులతో పాటు తన సతీమణి సోంపేట జడ్పిటిసి తడక యశోద నిధులు వెచ్చించి రైతులకు సౌకర్యవంతంగా చెరువు సమీపంలో చిన్నపాటి వంతెన నిర్మాణం చేపట్టారు. దీనివల్ల రైతులు వ్యవసాయ పంటలను గ్రామానికి తీసుకువచ్చేందుకు చేపట్టిన వంతెన నిర్మాణం వలన ట్రాక్టర్లకు రాకపోకలకు ఎంతో సౌకర్యవంతం కలిగిందని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటివరకు చుట్టూ తిరిగి అధిక దూరం వెళ్లాల్సి లేకుండా వంతెన నిర్మాణం వలన దూర భారం చాలా వరకు తగ్గడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ జాగారావును గురువారం ప్రత్యేకంగా దుస్సాలువ కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశైన సంఘం మాజీ అధ్యక్షులు దుద్ది ధర్మారావు, దుద్ది కోదండరావు, దేవాడ దుర్యోధన, దుద్ది రాజారావు, బీన గంగారావు, దుద్ది జానకి రావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు తల్లిదండ్రుల సమావేశం

**సోంపేట, డిసెంబరు 4(వార్త):** సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏ మోహన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి తల్లిదండ్రులు హాజరై అధ్యాపకులు, విద్యార్థులు యాజమాన్యం సమక్షంలో విద్యాభివృద్ధికి మరిన్ని సూచనలు సలహాలు ఇచ్చి అన్ని విషయాలు ముఖాముఖి చర్చించుకునే ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

## స్వదేశీ సంస్కృతిని అలవర్చుకోవాలి

**శ్రీకాకుళం, డిసెంబర్ 4(వార్త):** విద్యార్థి దశ నుంచే స్వదేశీ సంస్కృతిని అలవర్చుకోవాలని బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. గురువారం నందిగాం మండలం కాపు తెంబూరు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో మండల అధ్యక్షులు కామరాజు ఆధ్వర్యంలో ఆత్మనిర్భర భారత్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తేజేశ్వరరావు మాట్లాడుతూ విదేశీ వస్తువులను బహిష్కరించాలన్నారు. ఇప్పటి నుంచే స్వదేశీ వస్తువులను వినియోగం వల్ల ఇతర దేశాలపై ఆధారపడాల్సిన అవసరం ఉండ దన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబ్జి, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి అన్నెపు ఉమామహేశ్వరరావు, బీజేపీ నాయకులు పోకతోట సింహాచలం, జిల్లా యువమోర్చ అధ్యక్షులు బూరె నరేంద్ర, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు లక్కోజు ధర్మారావు, కొండాల జగన్నాధరావు, చింతాడ శ్రీను, టెక్కలి మండల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జర్జన రాంజీ, మండల ప్రధాన కార్యదర్శి శాసనపురి శ్రీను, తమ్మినేని ఆనందరావు, దేపల్లి నాగరాజు, నాలుగు మండ లాల కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## జెమ్స్ సౌజన్యంతో గోవిందపురంలో మెగా వైద్య శిబిరం



**పలాస, డిసెంబరు 4(వార్త):** జెమ్స్ సౌజన్యంతో శుక్రవారం పూండి గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవ శిబిరం ఆధ్వర్యంలో జిల్లా జెమ్స్ ఆసుపత్రి వైద్యులు చే మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ అన్నారు. గురువారం ఎన్ఎస్ఎస్ వాలంటరీలు స్థానిక గోవిందపురం హైస్కూల్ ఆవరణలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటరీలు పిచ్చి మొక్కలు, మురుగు నీరు తొలగించాలని కోరారు. ఆవరణ అంత శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారని అన్నారు.అదేవిధంగా 9,10 తరగతి విద్యార్థులకు ఆటల పోటీలు ఆడించి బహుమతులు ప్రదానం చేశారు . శుక్రవారం మెగా వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో ఎస్ రూప్ సుందర్, అధ్యాపకులు ఝూన్సి,రాంబాబు, భాగ్యలక్ష్మి, శోభారాణి, ఆలేఖ్య, సౌజన్య, వాణి, రమణ, పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆకాంక్షల మేరకు పలాసను జిల్లా చేయాలి

- అన్ని మౌలిక రంగ సౌకర్యాలు ఉన్నాయి
- వెనుకబడిన ప్రాంత అభివృద్ధి జిల్లా కేంద్రంతోనే సాధ్యం
- ఉద్దానం ప్రాంత చిరకాల స్వప్నం
- కళింగ సీమ అస్థిరత్వం ప్రశ్నార్థకం చేసిన ఆంధ్ర పెత్తందారులు
- సర్కార్ ప్రకటించే వరకు పోరాటం
- క్షేత్రస్థాయిలో జేఏసీతోనే మరింత ఉద్యమిస్తాం
- రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల స్పష్టీకరణ



**పలాస, డిసెంబరు 4(వార్త):** రాష్ట్ర విభజన అనంతరం పరిపాలన సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటుకు శ్రీకారం చుడుతూ, వెనుకబడిన ప్రాంతమైన పలాసను జిల్లా కేంద్రంగా ఏర్పాటుచేసి ప్రతిపాదన ఉందంటూ, సూత్రప్రాయంగా తెలియజేసిన తర్వాత పలాస జిల్లా లేదంటూ కూటమి సర్కార్ చేసిన ప్రకటన పలాస ప్రాంత ప్రజల మనోభావాలను దెబ్బతీసినట్లు అయిందని ప్రముఖ సామాజికవేత్త , న్యాయవాది దువ్వాడ శ్రీధర్ ( బాబా) నేతృత్వంలో పలు ప్రజా సంఘాలనాయకులు, న్యాయవాదులు, వైద్యులు, జర్నలిస్టులు, ఇతర మేధావి వర్గం ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం పలాస లోని గాలి మేడ వద్ద' పలాసను జిల్లా కేంద్రం'గా ప్రభుత్వం ప్రకటించాలంటూ రాజకీయాలకు అతీతంగా ఒక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జేఏసీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్ ( బాబా) మాట్లాడుతూ ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో కొంతకాలం అంతకుముందు ఒడిస్సా రాష్ట్ర పాలకుల పాలన, ఆంధ్ర రాష్ట్ర పాలకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తరువాత విభజన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పాలకులు పరిపాలించిన గాని శ్రీకాకుళం జిల్లా అత్యంత వెనుకబడిన ప్రాంతంగా, వలసల అడ్డాగా ముద్రపడిన పలాస ప్రాంతం స్వాతంత్ర్యం సిద్ధించి 7 దశాబ్దాలు గడిచినగాని, ఎటువంటి స్వాతంత్ర ఫలాలకు నోచుకోకుండా ఎంతో వెనుక బాటు తనంతో పాటు జరుగు బాటుతనం లేక ఇక్కడ ప్రజల జీవన ప్రమాణాలు అట్టడుగునా ఉన్న తీరు చూస్తే ఆందోళన కలిగిస్తుందన్నరు. స్వాతంత్రం రాకముందు బర్మా ( మయన్మార్ ) రాజధాని రంగూన్ వలస వెళ్లిన పరిస్థితి ఇక్కడ ఉండేదని, తర్వాత తీవ్ర కరువు కాటకాలు వల్ల భిలాయ్, అండమాన్ వంటి ప్రాంతాలకు ఈ ప్రాంత ప్రజలు వలసలు పోవడం పరిపాటయిందన్నారు. నేడు కూడా దేశంలో ఇతర ప్రాంతాలతో పాటు విదేశాలకు కూడా ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గ ప్రజలు స్థానికంగా ఉపాధి అవకాశాలు లేక వలసలు పోవడం జరుగుతుందని దువ్వాడ శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విశాల భావంతో రాజకీయాలకు అతీతంగా వెనుకబాటుకు గురైన నాలుగు నియోజకవర్గాలకు అనువైన ప్రాంతమైన పలాసను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని ఆయన కోరారు. జేఏసీ కో కన్వీనర్ డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు మాట్లాడుతూ వాస్తవానికి ఒకప్పుడు కటక్ సమీపంలో మహానది నుంచి పిఠాపురం సమీపంలో గోదావరి నది వరకు ఉన్న ప్రాంతం కళింగ సీమగా ఉండేదని, పరిపాలన సౌలభ్యం కోసం అనేకమార్లు కళింగ సీమ ముక్కలు ముక్కలుగా విడగొట్టడం జరిగిందని, ఎన్నో దశాబ్దాల నుంచి ఇక్కడ ప్రజానీకం తమ సొంత ప్రాంతం అస్థిరత్వం కాపాడుకునే ప్రయత్నంలో పలాసను జిల్లా కేంద్రంగా చేయాలన్న ఆకాంక్ష ప్రతి కలింగే సీమ పౌరుడులో ఉందని ఆయన స్పష్టం చేశారు. పరిపాలన సౌలభ్యం అంటూ కలింగసీమను ఆంధ్రీకరించారని, కళింగ సీమ విస్తీర్ణం చాలా పెద్దదని, అయితే తక్కువ విస్తీర్ణం కలిగిన ఆంధ్ర ప్రాంతంలో విలీనం చేసిన తర్వాత కళింగ సీమ ఉనికి కనుమరుగైందన్నారు. ఈ ప్రాంత ప్రజలకు పోరాటాలు కొత్త కాదని, పూర్వకాలంలో అశోకుడు దండయాత్ర చేస్తే విరోచితంగా కళింగ సీమలో ప్రజలంతా యుద్ధంలో తీవ్రంగా పోరాటం చేశారని, స్వాతంత్ర ఫలాలు అందరికీ అందకుండా పెత్తందారులు దోచుకుంటే, వారికి బుద్ధి చెప్పేందుకు వామపక్ష తీవ్రవాదం ఇక్కడ విస్తరించిందని, మందస జమీందారీ అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానంపై కూడా స్థానిక ప్రజలు పోరాటాలు చేశారని ఆయన గుర్తు చేశారు. సోంపేటలో, సంతబొమ్మాలిలో నెలకొల్పాలనుకున్న థర్మల్ ప్లాంట్లకు వ్యతిరేకంగా ప్రజలు తిరగబడి తరిమికొట్టిన చరిత్ర ఈ గడ్డకు ఉందన్నారు. విద్య, వైద్య, పారిశ్రామికంగా వెనకబడిన ఈ ప్రాంత అభివృద్ధికి జిల్లా కేంద్రంగా పలాస ప్రకటించే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు స్పష్టం చేశారు.

ఈ రౌండ్ సమావేశంలో ప్రముఖ న్యాయవాది, మాజీ జెడ్పిటిసి వరిస హరిప్రసాద్ మాట్లాడుతూ పలాసను జిల్లా కేంద్రంగా చేసేందుకు అన్ని మౌలికంగా వసతులు ఇక్కడ ఉన్నాయని, పలాసలో పెద్ద రైల్వే స్టేషన్, ఆర్డీవో కార్యాలయం, ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి, పలాస కిడ్నీ రీసెర్చ్ కేంద్రం, 300కు పైగా జీడిపప్పు పరిశ్రమలు, జాతీయ రహదారి సౌకర్యం, పలాసలో ఆర్టీసీ డిపో, సమీపంలో మూలపేట పోర్ట్, మరి కొన్ని విద్యాసంస్థలు ఈ ప్రాంతంలో ఉన్నాయని ఆయన వివరించారు. మరో న్యాయవాది కామేశ్వర పట్నాయక్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజల స్వప్నమైన పలాసను జిల్లా కేంద్రంగా చేయాలన్న ఆకాంక్షను ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని, అందుకు శాంతియుతంగానే ఇక్కడ ప్రజలు ఉద్యమిస్తారని, అంతేకాక పలాసను జిల్లా కేంద్రంగా ప్రకటించే వరకు క్షేత్రస్థాయిలో స్వచ్ఛందంగా ప్రజలు వివిధ రూపాలలో తమ నిరసనను తెలియజేస్తారని ఆయన సుతిమెత్తగా హెచ్చరించారు. ఉద్దానం పేరుతో పలాస కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయాలని అత్యధికులు అభిప్రాయపడ్డారు. 13 జిల్లాల నుంచి 26 జిల్లాలుగా ఏర్పాటు అయిందని కూటమి ప్రభుత్వం వచ్చాక ఐదు జిల్లాల్లో నూతనంగా ఏర్పాటు చేస్తామని ప్రతిపాదన వచ్చినప్పుడు అందులో మొట్టమొదటిది పలాస జిల్లాగా ఉండేదని కానీ పలాసను పక్కనే పెట్టడం వల్ల చాలా అన్యాయానికి గురి అయ్యామని వక్తుల అభిప్రాయపడ్డారు. ఈ సమావేశానికి పోలీసులు అనుమతి ఇవ్వకపోయినప్పటికీ, ప్రజల సహకారంతో దీనిని విజయవంతం చేశామని నిర్వాహకులు దువ్వాడ శ్రీధర్ (బాబు) ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో బోనెల గోపాల్, మజ్జి పున్నయ్య, ఎల్ వి చలం. వంకల మాధవరావు, కుమార్ నాయక్, రోణంకి వెంకటరమణ, దువ్వాడ నవీన్ చౌదరి, మద్దెల రామారావు, కె. వినోద్, ఏపీడబ్ల్యూజే నేషనల్ ప్రతినిధి దానేష్ మహారాణా, మండపాక నర్సింగరావు, జర్నలిస్ట్ తలగాపు వెంకటరమణ, శేఖర్, రవి, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

## పలాస

### పరిపాలన సౌలభ్యం కోసమే వికేంద్రీకరణ



**పలాస, డిసెంబరు 4(వార్త):** పరిపాలన సౌలభ్యం కోసమే వికేంద్రీకరణ చేసామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో ఆఫీస్ దగ్గర డి.ఎల్.డి.వో కార్యాలయం ను నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు స్థానిక జడ్పీహెచ్ స్కూల్ సాయి కాలనీ దరి లో పలాస (డి.ఎల్.డి.వో)డివిజనల్ డెవలప్మెంట్ అధికారి వారి కార్యాలయమును ఉదయం 11 గంటలకు పలాస శాసనసభ్యులు గౌతు శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా పలాస డివిజనల్ డిడిఓ బొడ్డేపల్లి శైలజ మాట్లాడుతూ 8 మండలాలతో నూతన డివిజన్ ఏర్పాటు కాబడిందని, మండల పరిషత్ కి సంబంధించిన అన్ని కార్యక్రమాలను పర్యవేక్షించడానికి ఈ ఏర్పాటు జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలాస డివిజన్ కి సంబంధించిన ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, జి.ఎస్.డబ్ల్యు.ఎస్ డిప్యూటీ ఎంపీడీవోలు పాల్గొన్నారు.

### రహదారుల అభివృద్ధితోనే ఆ ప్రాంతఅభివృద్ధి



**పలాస, డిసెంబరు 4(వార్త):** రహదారులు అభివృద్ధితోనే ఆ ప్రాంతం అభివృద్ధిని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. గురువారం పలాస కాశిబుగ్గ మున్సిపాలిటీ, 2 వ వార్డు పరిధిలో గల దత్తాశ్రమం దగ్గర 15 ఫైనాన్స్ నిధులతో నియోజకవర్గ ఎమ్మెల్యే సీసీ రోడ్డు శంకుస్థాపన చేశారు. సుమారు 15 లక్షలు వ్యయంతో దత్తాత్రేయ ఆశ్రమం నుండి నెమలి నారాయణపురం గ్రామం వరకు 120మీ. పొడవు గల సిసి రోడ్డు ను నియోజవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రవాణా సౌకర్యం ఉంటేనే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. అనంతరం దత్తాశ్రమానికి చేరుకొని, స్వామిని దర్శించుకుని, అక్కడకు వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జి వజ్జ గంగాభవాని, వార్డు అధ్యక్షుడు కోల కళ్యాణ్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### 13న జాతీయ లోక్ అదాలత్



**పలాస, డిసెంబరు 4(వార్త):** 13 వ తేదీ జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని పలాస సివిల్ కోర్టు జడ్జి యు మాధురి అన్నారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల వారి ఆదేశాలపై తేదీ 13-12-2025 న పలాస కోర్ట్ ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహిస్తున్నామని, అన్ని సివిల్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, మనోవర్తి కేసులు, గృహ హింస నిరోధక కేసులు, ఎక్సయిజ్ కేసులు రాజీ చేసుకోవచ్చని యూ. మాధురి మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు మరియు సివిల్ జడ్జ్ జూనియర్ డివిజన్, పలాస తెలిపారు. క్రిమినల్ కేసులలో ఫిర్యాదీదారులు సంభందిత పోలీసుల ద్వారా మరియు ముద్దాయిలు వారి వారి యొక్క న్యాయవాదుల ద్వారా పలాస కోర్ట్ కు వచ్చి కేసులను రాజీ చేసుకోవచ్చని, ఈ సదవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకుని ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేసుకోవాలని తెలిపారు. గురువారం 04-12-2025 న పలాస కోర్ట్ ఆవరణలో పలాస న్యాయవాదులతో కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు పోలీస్ అధికారులతో, పలాస ఎక్సయిజ్ అధికారులతో ప్రత్యేక సమావేశమును న్యాయమూర్తి నిర్వహించి ఆదేశాలను జారీ చేశారు. ఈ సమావేశంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు మొహమ్మద్ ఫయాజ్ అహ్మద్, సీనియర్ న్యాయవాదులు బి. కామేశ్వరరావు పట్నాయక్, జి. ప్రభాకర రావు, ఎస్. వెంకటరావు, పి. లక్ష్మీనారాయణ, టి. మురళీ మోహనరావ్, ఎన్. తేజేశ్వర రావు, కె. లోకేశ్వర రావు, కె. శ్రీనివాస్, పి. చిట్టిబాబు, వజ్రపుకొత్తూరు ఎస్.ఐ. ఎన్. నిహాల్, కాశీబుగ్గ ఎ.ఎస్.ఐ ఎమ్. గోవిందరాజు, ఎక్సైజ్ ఎస్.ఐ. ఎస్.కె. సైదా బీ మరియు వారి సిబ్బంది పాల్గొన్నారు.

### రేవంత్ రెడ్డి కి ఘన సన్మానం

**ఇచ్ఛాపురం, డిసెంబరు 4(వార్త):** అరవై తొమ్మిదవ జాతీయ తైక్వాండో లో బ్రాంజ్ మెడల్ సంపాదించిన ఆశి.రేవంత్ రెడ్డి కు స్థానిక పెద్దలు ఘనం గ సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్పర్సన్ పిలక రాజ్య లక్ష్మి,పాఠశాల హెచ్ ఎం సూర్యరావు పిలక . విజయ్,పట్టణ టీడీపీ ఇంచార్జి కోటి,కౌన్సిలర్ ఆశి.లీలరాణి,ఆశి. జీవులురెడ్డి,విద్యా కమిటీ చైర్మన్ లతా రెడ్డి, ఆశి గౌరి శంకర రెడ్డి,కామరాజు,జయలక్ష్మి సాయిబాబా,పద్మభాయ్,కృష్ణయ్య,కోచ్ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఆసి శ్రీధర్ రెడ్డి లతా దంపతుల కుమారుడు రేవంత్.అండర్ 17 నేషనల్ గేమ్స్ లో అండర్ 78 కేజీ కేటగిరిలో ఈ క్రీడలు అరుణాచల్ ప్రదేశ్ రాజధాని ఈటా నగర్ లో 24 నుండి 30 వరకు జరిగాయి .ఈ పోటీలలో రేవంత్ రెడ్డి బ్రాంజ్ పథకం సాధించడం జరిగింది అలాగే రేవంత్ రెడ్డికి కేలో ఇండియా గేమ్స్ లో పాల్గొనటానికి అవకాశం కూడా లభించింది.



## మెళియాపుట్టి

### రాధాకాంత గోవింద స్వామి ఆలయ హుండీ లెక్కింపు



**మెళియాపుట్టి, డిసెంబరు 4(వార్త):** మెళియాపుట్టిలో వేంచేసి ఉన్న రాధాకాంత గోవిందస్వామి ఆలయం హుండీని పాతపట్నం ఈవో వాసుదేవరావు ఆధ్వర్యంలో గురువారం లెక్కింపు నిర్వహించారు. ఈ లెక్కింపులో 19 నెలల కాలానికి సంబంధించి సుమారు 64599 రూపాయలు వచ్చినట్లు ఈవో తెలిపారు. అలాగే దేవాలయంలో నిత్య పూజా కార్యక్రమం చేస్తున్న అర్చకులు గోకుల కృష్ణకు జీతభత్యాలు అందే విధంగా చర్యలు తీసుకొనున్నట్లు ఈవో వాసుదేవరావు తెలిపారు. హుండీ లెక్కింపు సమయంలో ఈవో తో పాటు ఆలయ అర్చకులు గోకుల్ కృష్ణ రథో, టెక్కలి గ్రూప్ దేవాదాయ అధికారిని నమస్వి, బోన్ శంకర్రావు, యువకులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

### క్రీడా మైదానానికి నిధుల మంజూరుకు కృషి

**-ఎమ్మెల్యే మామిడి గోవిందరావు**

**మెళియాపుట్టి, డిసెంబరు 4(వార్త):** మెళియాపుట్టిలో అసంపూర్తిగా ఉన్న క్రీడ మైదానం పనులు పూర్తి చేసినందుకు నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు హామీ ఇచ్చినట్లు స్థానిక యువత తెలియజేశారు. పాతపట్నంలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం నాడు స్థానిక మెళియాపుట్టి యువకులు, నాయకులు కలిసి క్రీడ మైదానం గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని రాగా దీనిపై ఆయన స్పందిస్తూ ఎంపీ లాండ్స్ నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టుగా వారు తెలిపారు. ఎమ్మెల్యేకు కలిసి విన్నవించిన వారిలో పాతపట్నం ఎఎంసి పూర్వపు వైస్ చైర్మన్ అనపాన రాజశేఖర్ రెడ్డి, సర్పంచ్ ప్రతినిధి రేఖాన వాసు, పెద్ద పద్మ పురం సర్పంచ్ ప్రతినిధి మాలతి శ్రీధర్, గాలి శంకర్, గాలి నగేష్, గాలి రామకృష్ణ, దుక్క శంకర్, లంక బృందావన్, ఢిల్లీ ప్రధాన్, మనీ, యువకులు తదితరులున్నారు.



# డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం



**జి.సిగడాం, డిసెంబరు 4(వార్త):** మెట్టవలస పంచాయితీ పాలఖండ్యాం కూడలి వద్ద ఎన్నో ఏళ్ల డ్రైనేజ్ సమస్య నెలకొని ఉన్నది.మురుగుకాల్వలు సరిగా లేకపోవడం వల్ల ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు, వర్షాల సమయంలో వరదనీరు రోడ్లపై పారుతూ తీవ్ర అపరిశుభ్రత నెలకొని ఉండేదని, దీంతో ప్రజలు ఇబ్బంది పడుతుండేవారు ఈ డ్రైనేజీ సమస్య పై స్థానిక నాయుకులు సర్పంచ్ కామోజుల సీతారాం, జి.సిగడాం పీఏసీఎస్ అధ్యక్షుడు బెవర జగన్నాధరావు ఇటీవలె ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కు వినతపత్రం అందజేశారు.ఈ విషయం పై ఎమ్మెల్యే స్పందిస్తూ సంబదిత అదికారులతో మాట్లాడి డ్రైనేజీ శాశ్వత పరిష్కారం కోసం సూమారు రూ.6లక్షల నిదులను మంజూరు చేసి పనులను ప్రారంభించారు. ఈ పనులను మండల టిడిపి అద్యక్షులు కుమరాపు రవి,స్థానిక నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు నాణ్యతగా చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణాన్ని కూడా త్వరగా పూర్తి చేసి డ్రైనేజీ ద్వారా మురుగునీరు, వరద నీరు వెళ్లేలా చేయాలని సూచించారు. కొన్నేళ్ల నుంచి పట్టి పీడిస్తున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నట్లు పేర్కొన్నారు. వారితో పాటు బాతువ పీఏసీఎస్ అద్యక్షులు నక్క మురళీ ఉన్నారు. ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు.

# మినిమం టైమ్ స్కేల్ మంజూరు చేయండి



**ఎల్ఎన్ పేట, డిసెంబరు 4(వార్త):** మండలంలో నేడు సి ఆర్ పి లందరూ తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల తహశీల్దార్ జె. ఈశ్వరమ్మకు వినతిపత్రం ఇచ్చారు. స్కూల్ కాంప్లెక్షల్లో ఏ,బి అనే రెండు రకాల క్లస్టర్ ప్రతిపాదిత విధానాన్ని విరమించాలని మండలంలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా పనిచేస్తున్నామని కానీ తమ వేతనాలలో మాత్రం ఏ మాత్రం పెరుగుదల లేకుండా మమ్మల్ని నిర్లక్ష్యం చేస్తున్నారని సమాన పనికి సమాన వేతనం కల్పించడం లేదని 2019లోనే మా సమగ్ర శిక్ష ఉద్యోగులు అందరికీ మినిమం టైం స్కేల్ మంజూరు చేస్తూ 24,40,5పేరిట 3 జీవోలు విడుదల చేశారని కానీ నేటికీ అవి అమలు జరగలేదని ఇప్పటికైనా ప్రభుత్వం మా సేవలను గుర్తించి వెంటనే టైమ్ స్కేల్ మంజూరు చేసి విద్యా శాఖలో విలీనం చేయాలని దశల వారీగా రెగ్యులర్ చేయాలనీ రానున్న డీఎస్సీలో సిఆర్పిలందరికీ వెయిటేజ్ కల్పించాలని ట్రాన్స్పోర్ట్ అలవెన్స్ మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏపీ సిఆర్పి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పి. తవిటినాయుడు, అచ్యుతరావు ఎం.సింహాచలం, ఎం.శ్రీధర్ పాల్గొన్నారు.

# ఎఫ్ఎల్ఎన్ సర్వేను వేగవంతం చేయాలి

**హిరమండలం/ఎల్ఎన్ పేట, డిసెంబరు 4(వార్త):** వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో, విద్యార్థుల స్టాండర్డ్స్ ను తెలుసుకునేందుకు, నిర్వహిస్తున్న ఎఫ్ ఎల్ ఎన్ సర్వే హిరమండలం మండలంలో మరింత వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి కె. రాంబాబు తెలిపారు.



గురువారం సాయంత్రం ఎం.పీ.పీ.ఎస్ హిరమండలం పాఠశాలలో చేపడుతున్న ఎఫ్ఎల్ ఎన్ సర్వే కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు సుమారు 85% ఈ సర్వేను పూర్తి చేశామని ఎంఈఓ ప్రకటించారు. ఈ సర్వే ద్వారా, విద్యార్థుల స్థాయి స్పష్టంగా తెలుస్తుందని, ఆయన పేర్కొన్నారు, ఈ సర్వే తరగతి గదిలో ప్రతి విద్యార్థికి, నిర్వహిస్తూ, ఆన్లైన్ ద్వారా, వచ్చిన ప్రశ్నావళి, విద్యార్థులచే, చేయిస్తూ, గణితం. ఇంగ్లీషు. తెలుగు. వంటి సబ్జెక్టుల స్టాండర్డ్స్ ను, తెలుసుకోవడం అవుతుందని, ఎంఈఓ అన్నారు. ఈ నెల 5న. మెగాపేరెంట్స్ డే సందర్భంగా, ఎఫ్ఎల్ ఎన్. సర్వే సైట్ను, ప్రభుత్వం తాత్కాలికంగా నిలుపుదల చేసిందని, ఆయన పేర్కొన్నారు .మరికొద్ది సమయం తర్వాత, ఈ సైట్ ప్రారంభం అయిన వెంటనే ,శత శాతం ఈ సర్వేను, పూర్తి చేస్తామని ఆయన ప్రకటించారు. ఈ సర్వే నిర్వహించేందుకే, ఎంఈఓ 2. ఎస్. దాలయ్య ,మరియు తమ సిబ్బంది సహకారంతో ,ఈ సర్వే మరింత వేగవంతంగా సాగుతుందని, ఎంఈఓ కె. రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ లు పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి దేవాంగుల సన్మానం

**పోలాకి, డిసెంబరు 4(వార్త):** దేవాంగ కులానికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్లో భాగంగా మగ్గం వృత్తిదారులకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వడంపై కులస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ హామీ అమలుపై కృతజ్ఞతగా పోలాకీ మండలం మబుగాం గ్రామస్తులు గురువారం స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని ఘనంగా సన్మానించారు. చౌడేశ్వరి వీవర్స్ సొసైటీ ప్రతినిధి వట్టి వెంకట గణేష్ మాట్లాడుతూ, మగ్గం వృత్తిదారుల కోసం ఉచిత విద్యుత్ కల్పన ఆర్థిక భారం తగ్గించే కీలక చర్యగా అభివర్ణించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా తమ కులానికి సముచిత ప్రోత్సాహం లభిస్తోందని తెలిపారు. సన్మాన కార్యక్రమంలో దేవాంగ కుల పెద్దలు, సొసైటీ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# చెరువుబట్టారు..!

### -రాజుల చెరువు ఆక్రమణల రాజ్యంలో బందీ!

**నరసన్నపేట, డిసెంబరు 4(వార్త):**
నరసన్నపేట హృదయంలో ఒడిసి పెట్టిన రాజుల చెరువుగతంలో ప్రజల దాహార్తిని తీర్చిన ఈ మహా వనరుఈరోజు మురికితో నిండిన కూపంగా మారిపోవడం తీవ్రమైన విచారం. ఒక్కప్పుడు 30 ఎకరాల విస్తీర్ణంలో మెరిసిన చెరువు, ఇప్పుడు కేవలం మూడు ఎకరాల నీరస నీడ మాత్రమే మిగిలింది. చెరువు ఒడ్డున సాగిన అడుగడుగునా అక్రమ నిర్మాణాలు, పెరిగిన వాణిజ్య భవనాలు భూమిని ముక్కలుగా కొరుక్కుంటూ చెరువును పూర్తిగా మింగేశాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ భారీ ఆక్రమణలపై కనుగుడ్డి వేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ చట్టాలు ఉన్నా, అమలు మాత్రం నాథిలేని అనాథలా మారిపోయింది. ప్రజలకు ప్రాణాధారం లాంటి చెరువులు పట్టణ అభివృద్ధి పేరిట పాతిపెట్టబడటం, భవిష్యత్ తరాల నీటి భద్రతను ప్రమాదంలోకి నెట్టేస్తోంది. జిల్లాలో ఇలాంటి చెరువులు ఒకటే కావు అనేక నీటివనరులు కూడా ఇలాగే ఆక్రమణల దాహానికి బలవుతున్నాయి. నేడు వీటి రక్షణ కోసం చర్యలు తీసుకోకపోతే, రేపు నీటి సమస్యల రూపంలో పెద్ద



విలయం తప్పదు. చెరువులను కాపాడటం ప్రభుత్వమే కాదు, ప్రతి పౌరుడి బాధ్యత. చెరువులున్న చోట జీవం ఉంటుంది%ొ% చెరువులు మరిగితే మన భవిష్యత్తే ఎండిపోతుంది.

## నరసన్నపేట

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత



**నరసన్నపేట, డిసెంబరు 4(వార్త):** దేవాది 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో రేపు (శుక్రవారం) తాత్కాలికంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు విభాగం ఏఈ పల్లి బాలకృష్ణ వెల్లడించారు. సబ్‌స్టేషన్ మరమ్మతు పనులు చేపడుతున్న నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. పనులు సకాలంలో పూర్తి చేసేందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు. మరమ్మతుల అనంతరం విద్యుత్ సరఫరా యథావిధిగా పునరుద్ధరించబడుతుందని అధికారులు పేర్కొన్నారు.

### జిల్లా స్పోర్ట్స్ మీట్‌లో మెరిసిన పుష్పలత



**నరసన్నపేట, డిసెంబరు 4(వార్త):**శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియంలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో నరసన్నపేట డిగ్రీ కళాశాల విద్యార్థిని పి. పుష్పలత తన ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించింది. 100 మీటర్ల పరుగు పందెంలో ఆమె జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం సాధించి పాఠశాల ప్రతిష్ఠను పెంచింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ పి. లత మాట్లాడుతూ, 2025%-%26 మేరా యువభారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ స్పోర్ట్స్ మీట్‌లో పుష్పలత సాధించిన విజయం గుర్తుంచుకోవాల్సినదని అన్నారు. క్రీడలపై ఆసక్తి, క్రమశిక్షణ, నిరంతర సాధనతో మరింత ఉన్నత స్థాయిలో మెరుగైన ఫలితాలు అందుకోవచ్చని శుభాకాంక్షలు తెలిపారు. పుష్పలత విజయంపై అధ్యాపకులు, సహవిద్యార్థులు మరియు పలువురు క్రీడాభిమానులు అభినందనలు తెలిపారు.

### అండర్-14 బాలికల వాలీబాల్ శిక్షణ ప్రారంభం



**నరసన్నపేట, డిసెంబరు 4(వార్త):** అండర్-14 విభాగంలోని బాలికల కోసం వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని నరసన్నపేట పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అడ్వైజర్ సుందర్‌రావు మాట్లాడుతూ, రాబోయే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ఈ నెల 11 నుండి 13 వరకు నెల్లూరులో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా తరఫున ప్రతినిధిగా ఈ జట్టును రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతున్నామని పేర్కొన్నారు. బాలికలు క్రీడలలో ముందంజలో సాగాలంటే ఇలాంటి శిక్షణ శిబిరాలు ఎంతో ఉపయోగకరమని ఆయన అభిప్రాయపడ్డారు. శిక్షణలో పాల్గొంటున్న విద్యార్థినులు ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీడీలు వెంకటరమణ, పోలినాయుడు, ఉపాధ్యాయులు మరియు క్రీడాకారిణులు పాల్గొన్నారు.

### నరసన్నపేట మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గానికి ఎంఈఓ అభినందనలు

**నరసన్నపేట, డిసెంబరు 4(వార్త):**నరసన్నపేట యుటిఎఫ్ మండల కార్యవర్గ సభ్యుల ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా జరిగి, కొత్త పదవాదారులు బాధ్యతలు స్వీకరించారు. తాజాగా ఎన్నికైన మండల కార్యవర్గ సభ్యులను ఎంఈఓ పేడాడ దాలినాయుడు గురువారం ఉదయం నరసన్నపేట ఎంఆర్సీ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నక్క అప్పయ్య, కార్యదర్శి జగదీష్‌తో పాటు ఇతర సభ్యులు ఎంఈఓని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలని, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమన్వయంతో ముందుకు సాగాలని ఎంఈఓ సూచించారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం మండల కార్యవర్గం ప్రభావవంతంగా పనిచేయాలన్నారు. సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ఘనంగా నీలమణి దేవి శోభాయాత్ర



**సారవకోట, డిసెంబరు 4(వార్త):** మార్గశిర పౌర్ణమి సందర్భంగా శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం అవలింగి గ్రామం భక్తిరసంతో కళకళలాడింది. వేంచేసి ఉన్న శ్రీ చక్ర సమేత శ్రీ శ్రీ శ్రీ నిలమణి దేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, శోభాయాత్ర, అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిదిన్నర గంటలకు మొదలైన శోభాయాత్రలో పాలకలశాలు, మంగళవాద్యాలు, భవానీలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని ప్రత్యేక శోభతో ప్రదర్శించారు. గ్రామ వీధుల గుండా సాగిన ఈ శోభాయాత్రలో భక్తులు నామస్మరణతో మార్మోగించగా, ఆధ్యాత్మిక వాతావరణం గ్రామమంతా విస్తరించింది. శోభాయాత్ర అనంతరం అమ్మవారిని ఘనంగా మూల విరాట వద్దకు తీసుకువెళ్లి, అర్చక స్వామి ఆధ్వర్యంలో భక్తులందరి భాగస్వామ్యంతో క్షీరాభిషేకం నిర్వహించారు. పాలు, పవిత్ర జలాలు, పుష్పాల సమర్పణతో జరిగిన ఈ క్షీరాభిషేకం భక్తులను ఆధ్యాత్మిక మధురానుభూతికి గురిచేసింది. ఈ కార్యక్రమాలన్నింటిని సమన్వయం చేసిన అర్ధిక స్వామి భాస్కర భవాని వివరించినట్టు, ప్రతి సంవత్సరమూ మార్గశిర పౌర్ణమి రోజు నిర్వహించే ఈ మహోత్సవం గ్రామ ప్రజలు మాత్రమే కాదు, పరిసర ప్రాంతాల భక్తులందరికీ ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగించేదని తెలిపారు. గ్రామం మొత్తం పండుగ వాతావరణంతో నిండిపోయిన ఈ వేడుకలో భక్తులు అమ్మవారి



దయకటాక్షాలు కోరుకుంటూ పాల్గొన్నారు. సంప్రదాయం, దైవభక్తి, గ్రామీయ సంస్కృతిఅన్నీ ఒకటిగా ౹అవలింగిలో ఈ పౌర్ణమి ప్రత్యేకతగా నిలిచింది.

# సారవకోటలో 'కోటి సంతకాల' సేకరణ



**సారవకోట, డిసెంబరు 4(వార్త):** ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ అధిష్ఠానం పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమం సారవకోటలో భారీ ప్రజా మద్దతుతో కొనసాగింది. జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ, ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఇప్పటికే తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ చేతులకు అప్పగించే కుట్రను ప్రజలు గట్టిగా ప్రతిఘటిస్తున్నారని ఆయన అన్నారు. రైతులు తమ పంటను అమ్ముకోలేని పరిస్థితిలో ఉన్నప్పటికీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నదని విమర్శించారు. ప్రజల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని ధర్మాన స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సజావుగా ఎరువుల పంపిణీ



**జి.సిగడాం, డిసెంబరు 4(వార్త):** పెంట గ్రామ రైతు సేవా కేంద్రంలో గురువారం రైతులకు రాయితీపై యూరియా, ఎరువులను పెంట గ్రామ నీటి సంఘ అద్యక్షరాలు మీసాల విజయలక్ష్మీ, సర్పంచ్ పున్నాన సోనియా, ఎంపీటీసీ మక్క శ్రీలత పంపిణీ చేశారు.

విజయలక్ష్మీ మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. గ్రామ వ్యవసాయ అదికారిణి తలచింతల కుసుమ మాట్లాడుతూ అధునాతన పద్ధతులను వాడి దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, టీడీపీ మక్క నారాయణరావు, పున్నాన అక్కలనాయడు, మక్క శ్రీనివాసరావు, జడ్డు సంతు, మీసాల సంతు, మీసాల అశోక్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జలుమూరు

### ఎరువుల దుకాణంలో అధికారుల తనిఖీలు



**జలుమూరు, డిసెంబరు 4(వార్త):** నాగిరికటకం కేంద్రంలోని అరుణ ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని వ్యవసాయ శాఖ అధికారులు గురువారం సడెన్ ఇన్‌స్పెక్షన్ చేశారు. ఈ సందర్భంగా ఎ.ఏఓ కింజరాపు. రవికుమార్ మరియు ఏడీఏ ఎల్.వి.మధు దుకాణంలో నిల్వ ఉన్న ఎరువుల స్టాక్, బిల్లులు, విక్రయ వివరాలు మరియు రికార్డులను జాగ్రత్తగా పరిశీలించారు. ఎరువులను ఎంఆర్‌పీ ధరలకు మాత్రమే విక్రయించాలని డీలర్‌ను అధికారులు తీవ్రంగా హెచ్చరించారు. ముఖ్యంగా యూరియాను అధిక ధరలకు విక్రయించకూడదని స్పష్టం చేస్తూ వ్యతిరేక చర్యలు తీసుకుంటామని హెచ్చరిక జారీ చేశారు. రైతులకు నాణ్యమైన ఎరువులు న్యాయమైన ధరలకు అందేలా తనిఖీలు కొనసాగుతాయని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

### గ్రిగ్స్ మెరిసిన రామకృష్ణాపురం జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు



**జలుమూరు, డిసెంబరు 4(వార్త):** రామకృష్ణాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయి గ్రిగ్స్ క్రీడా పోటీలలో ప్రతిభ చాటుతూ అత్యధిక షీల్డ్‌ను సాధించారు. విభిన్న విభాగాల్లో అద్భుత ప్రదర్శన కనబరచిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించడంతో పాఠశాల ప్రతిష్ఠను నిలబెట్టారు. ఈ సందర్భంగా గురువారం ప్రధానోపాధ్యాయులు ఈశ్వరరావు విద్యార్థులను అభినందించారు. ఇటీవల డీఎస్సీ ద్వారా పాఠశాలకు కొత్తగా నియమితులైన పీడీ గణపతిరావు సమగ్ర శిక్షణ అందించడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని హెచ్‌ఎం పేర్కొన్నారు. విద్యార్థులు మరింత ఉన్నత స్థాయిలో కూడా మెరుగైన ఫలితాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

### ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో విజేతలకు బహుమతుల అందజేత



**జలుమూరు, డిసెంబరు 4(వార్త):** కరవంజ ఏపీ మోడల్ స్కూల్లో గత నెల 30వ తేదీన ఎన్.ఎం.ఎం.ఎస్ పరీక్షలు జరిగాయి. ఇందులో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశామని వైస్ ప్రిన్సిపల్ వాసు తెలిపారు. తత్ర త్రివేణి, డి గౌతమి, కె లిఖిత మొదటి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని చెప్పారు. కార్యక్రమంలో చల్లపేట జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### 7న జవహర్ నవోదయ నమూనా పరీక్ష

**శ్రీకాకుళం, డిసెంబర్ 4(వార్త):**కేంద్ర పౌర విమానయన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్ర మం ఎర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశాలకు సన్నద్ధ మవుతున్న విద్యార్థులకు నమూనా పరీక్షను ఈనెల 7వ తేదీన నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను గురువారం నిర్వాహకులు విడుదల చేశారు. నవోదయ పాఠశాల ప్రవేశం కొరకు ప్రధాన పరీక్షలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు, చిన్న వయస్సులో పోటీ పరీక్షలపై భయాన్ని తొలగించేందుకు ఈ నమూనా పరీక్ష దోహదం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నెల 7వ తేదీన శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు సమీప ప్రాంతాల్లో ప్రధాన పరీక్షకు తీసిపోని స్థాయిలో అదే సమయ పాలన, ప్రశ్నాపత్ర సరళితో ఈ నమూనా పరీక్ష జరగనుందని తెలిపారు. ఇందుకోసం https:// www.yvssrikakulam.live/navo-daya-registration వెబ్‌సైట్‌లో ముందుగా విద్యార్థులు వారి వివరాలు నమోదు చేసి రిజిస్టర్ అవ్వాలని అన్నారు. రిజిస్టర్ అయిన విద్యార్థులు వెబ్ సైట్ నుండి హాల్ టికెట్ పొంది కేటాయించిన పరీక్షా కేంద్రాల్లో 7వ తేదీ ఉదయం 11 గంటలకు హాజరవ్వాలని, 11:30కు పరీక్ష ప్రారంభం అవు తుందని స్పష్టం చేశారు. ఇందుకోసం శ్రీకాకుళం గొంటి వీధిలో గల విద్యాధరి కళాశాల, పాతపట్నం కోర్టు దగ్గర గల మహేంద్ర జూనియర్ కళాశాల, పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక శివాజీ నగర్ మధర్ థెరిసా విద్యాలయం, టెక్కలిలో శ్రీ విశ్వజ్యోతి డిగ్రీ కళాశాల, సోంపేట పాత ఎస్బిఐ వీధిలో వి.వి.కే శిశు మందిర్ హై స్కూల్ లలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546